

హైదరాబాద్ వార్త

హత్యకేసులో

# నిర్లక్ష్యానికి సిఐ, ఎస్ఐపై వేటు

**గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్ఐ దీక్షిత్ రెడ్డిలను సస్పెండ్ చేసిన నగర సిపి**





సస్పెండ్ అయిన గోపాలపురం సిఐ మురళీధర్, ఎస్ఐ దీక్షిత్ రెడ్డి

అడ్డగుట్ట, జనవరి 31 ప్రభాతవార్త: ఓ హత్య కేసులో విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్‌తో పాటు ఎస్ఐ దీక్షిత్ రెడ్డిలను సస్పెండ్ చేసినట్లు పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గోపాలపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్.డి.రోడ్డు సంగీత్ చౌరస్తా సమీపంలోని డీ మార్ట్ బిల్డింగ్‌లోని 3వ ఫ్లోర్‌లో 2023 సెప్టెంబర్ 29న సినీ నిర్మాత అంజిరెడ్డి హత్యకు గురైయ్యాడు. పథకం ప్రకారం నిందితులు అంజిరెడ్డిని హత్య చేసేందుకు ప్రయత్నించగా ఆయన ప్రతిఘటించడంతో కర్రలతో తలపై మోదీ దారుణంగా హత్య చేశారు. ఆ తరువాత హత్యను ప్రమాదంగా జరిగినట్లు చిత్రీకరించి అంజిరెడ్డి కుమారుడికి మీ నాన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని హత్య చేసిన నిందితులే సమాచారం ఇచ్చారు. దీంతో హత్యకు గురైన అంజిరెడ్డి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు జరిపారు. కాగా ఈ కేసులో ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఎస్.ఐ.దీక్షిత్‌లు విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలతో సస్పెండ్ చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## మున్సిపల్ వర్గ పోరుకు చెక్?

-- పంతాలు.. పట్టింపులు వద్దు..

-- ప్రజాసమస్యలు, పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలి

-- పాలకవర్గానికి సూచించిన ఎమ్మెల్యే

-- సాదా సీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తాండూరు, జనవరి 31, ప్రభాతవార్త : గత నాలుగేళ్లుగా ప్రజా సమస్యలు, పట్టణాభివృద్ధి పట్టించుకోకుండా ఆదిపత్య పోరుతో కొనసాగుతున్న తాండూరు మున్సిపల్ పాలకవర్గం వ్యవహారాన్ని ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి చక్కదిద్ది తన మార్క్‌ను చాటుకున్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఎన్నుకున్నారని.. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుం డా పంతాలు.. పట్టింపులకు పోకుండా ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కౌన్సిలర్లకు సూచించారు. బుధవారం తాండూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి ముఖ్య అథితిగా హాజరయ్యారు. గత నాలుగేళ్లుగా కౌన్సిల్ సమావేశం అంటేనే అట్టుడికి పోయేది. తొలిసారి కౌన్సిల్ సమావేశంలో అలాంటి పరిణామాలు కనిపించలేదు. ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి సమక్షంలో సమావేశం సాధాసీదాగా కొనసాగింది. ఎజెండాలోని 24 అంశాలను ప్రవేశ పెట్టగా 22అంశాలకు సభ్యులు అమోదం తెలిపారు. 2అంశాలను తిరస్కరించి సమావేశం సజావుగా ముగించారు. అయితే, ఈ సందర్బంగా ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన నాలుగు సంవత్సరాలు ఏం జరిగింది అనేది పక్కన పెట్టి మిగిలిన ఏడాది సమయాన్ని వృధా చేయకుండా సభ్యులంతా కలిసికట్టుగా పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కౌన్సిల్‌లో ప్రతిపక్షం, పాలకపక్షం రెండు ఉండాలని, ఈ రెండు కూడా ప్రజల పక్షంగా పనిచేయాలన్నారు.



నర్సులను అదుపులోకి వాహానం ఎక్కిస్తున్న పోలీసులు

## పోలీసుల అదుపులోకి స్టాఫ్ నర్సులు

ఎల్‌బి స్టేడియంలో స్టాఫ్ నర్సుల సభ కొనసాగుతుండగా గచ్చిబౌలిలోని టిమ్స్ ఆసుపత్రికి చెందిన కొంత మంది కాంట్రాక్ట్ నర్సులు స్టేడియం వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు చేబూని తమకు 20 శాతం వెయిటేజ్ మార్కులు ఇచ్చి రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. తమకు ఉద్యోగాలు కల్పించాలని, ఎంతో కాలంగా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అదుపులోకి తీసుకుని వాహానం ఎక్కించారు.

(ప్రభాతవార్త – సైఫాబాద్)

మోడీ హఠావో దేశ్‌కు బచావో నినాదంతో 100 ఎంపి స్థానాలకు పోటి

సోమేష్‌కుమార్ ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలి: టిడిపి

2, 3వ పేజీ లలో

# తీరు మారని అధికారులు

## ప్రతి పనికో రేటు ● ప్రభుత్వ కార్యాయాల్లో సిబ్బంది తీరు

### ఎసిబి దాడుల్లో వెలుగులోకి అవినీతి జలగలు

హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త: లబ్దిదారులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం, ఇతర ప్రయోజనాలు ఏవైనా ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు ఇవ్వందే దస్త్రం కదలని పరిస్థితి నెలకొంది. చేయి తడిపితేకానీ అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగానే వినిపిస్తున్నాయి. ఆస్తి బదలాయింపు, నల్లాకనెక్షన్, పవర్ కనెక్షన్ వంటివాటికి చేయి తపడనిదే అనుమతులు రాని పరిస్థితి నెలకొంది. ఇటీవల హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ బాలకృష్ణ ఇంటిపై ఎసిబి దాడులు చేస్తే కోట్లకొద్ది నోట్ల కట్టలు, కిలోల కొద్దీబంగారం, వందకోట్లకు పైగా స్థిర చరాస్తులు పట్టిపడిన విషయం తెలిసిందే, అలాగే నారాయణ గూడలో ఓట్రాఫిక్ పోలీస్ మద్యం మత్తులో పట్టుబడ్డ ఓవాహన దారుడినుంచి 5వేలు వసూలు చేస్తుంగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అలాగే నగరంలోని పలు స్టేషన్లలో దందాలు చేస్తున్న అధికారులపై సిపి చర్యలు తీసుకుంటున్న సంఘటనలు చూస్తున్నాం. ఈనేపథ్యంలో ప్రభుత్వశాఖల్లోని అవినీతిపై జనాల్లో చర్చ జరుగుతుంది. జిహెచ్ఎంసీ, వాటర్‌బోర్ట్, ఎలక్ట్రిసిటీ, రెవె న్యూ వంటి అనేకశాఖల్లో అవినీతి తాండవి స్తోందని జనం చర్చించుకుంటున్నారు ఈనేప థ్యంలో వివిధ శాఖల్లో పనుల నిమిత్తం తాము వెళ్ళిన ఘటనలను చర్చించుకుం టున్నారు.

**డబ్బులు ఇవ్వకుంటే దస్త్రం కదలదు**

వివిధ అంశాల్లో దరఖాస్తు చేసుకుని తమ పనులు చేసిపెట్టాలని వెళ్లిన లబ్దిదారులు డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేని పోని కారణాలు చూపిస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది.



చివరికి పనులకోసం కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన లబ్దిదారులు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారిపనులు చేయించేకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చేయి తడిపితే మాత్రం అవసరమై ధ్రువపత్రాలు ఉన్నా లేకున్నా పనులు చకచకా చేసిపెడుతున్నారు. లంచావతారుల బెడద తప్పించడానికి ప్రభుత్వం పలురకాల ప్రయోజనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనే నిబంధనలు ప్రవేశపెట్టింది. అయితే ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునప్పటికీ సంబంధిత విచారణాధికారిని కలువకపోతే ఆశించిన ప్రయోజనం అందుబాటులోకి రాకుండా పోతుంది. సదరు అధికారిని కలిసి ఎంతో కొంత ముట్టచెబితేనే సకాలంలో పనులయ్యేలా చూస్తున్నారు. వేలకు వేల రూపాయలు వేతనాలు రూపంలో పొందుతున్న అధికారుల దిగజారుడుతనం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.

**కేసుల అంతంతమాత్రమే..** అవినీతి నిరోధక శాఖ (ఏసీబి) రెండు రకాల కేసులు నమోదు చేస్తుంది. అధికారులు ఎవరైనా పనులు చేయటానికి లంచాలు అడుగుతున్నట్లు బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు అందించేటప్పుడు వలపన్ని అధికారులను పట్టుకుంటారు. రెండోది.. ఆదాయానికి మించి ఆస్తులున్న వ్యాపారులు,అధికారులను సైతం, ఇళ్లు, వారి వ్యాపార కేంద్రాలపై దాడులు చేసి పట్టుకుంటారు. అయితే బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు అక్కడక్కడ లంచావతారులను పట్టుకుంటున్న అధికారులు ఆదాయానికి మించి ఆస్తులున్నవారిపై దృష్టి సారించడం లేదు. ఇలాంటి వారిపై రహస్యంగా విచారణ జరిపి పట్టుకోవాల్సి ఉండగా ఇలాంటి కేసుల విషయంలో ఆసక్తి కనబరచడం లేదు. ప్రలు ప్రభుత్వశాఖల్లో లంచాలు పెరుగుతున్నా కేసులు మాత్రం పెరగటం లేదు. ఏసీబికి దొరికిన అధికారులు ఏదోఒక రాజకీయ నాయకుడి అండతో కొంతకాలంపాటు దూరప్రాంతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని మళ్ళీ పాతపాటే పాడుతున్నారు. కారణం అవినీతి నిరోదక శాఖ గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడమేనని తెలుస్తుంది. దీంతో ప్రతి ఏడాది కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఏదోలా మనపని అయిపోయిందనే ధోరని కారణం వల్ల పలువురు ఫిర్యాదులు చేయడానికి ఆసక్తి కనబరచడం లేదు.

## గుంతలమయంగా రోడ్లు

**పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు**

అడ్డగుట్ట, జనవరి 31 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని రెజిమెంటల్ బజార్ లో రోడ్ల మరమ్మత్తులకు నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మత్తులు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలోని సుప్రబాత్ లాడ్జ్ ఎదురుగా ఉన్న రోడ్డులో బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ కో–ఆప్షన్ సభ్యుడు నర్సింహ్మా ముదిరాజ్ ఇంటి ముందే గుంతలమయంగా ఉన్న రోడ్డుతో స్థానికులు, పాఠశాలలో వెళ్లే విద్యార్థులు, పాదచారులు ప్రమాదాలకు గురౌతున్నా రోడ్డు మరమ్మత్తులు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వి, పైప్‌లు వేసి సంవత్సరం గడిచిన మరమ్మత్తులు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే లాస్య నందిత, మోండా కార్పొరేటర్ కొంతం దీపికలు స్పందించి గుంతలమయంగా ఉన్న రోడ్డును మరమ్మత్తులు చేయించాలని స్థానికులు వ్యక్తం చేశారు.



నిధులు మంజూరైన మరమ్మత్తులు చేపట్టని రెజిమెంటల్ బజార్

## అక్రమ నిర్మాణాల తొలగింపు

తార్నాక, జనవరి 31 ప్రభాతవార్త: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. తార్నాక నుంచి లాలాపేట్ వైపు వెళ్లే రోడ్డులో ఉన్న ప్రముఖ తాజా కిచెన్ హోటల్ వారు ఫుట్‌పాత్‌ను ఆక్రమించి యదేచ్ఛగా పార్కింగ్‌ను ఏర్పాటు చేసుకున్న నిర్మాణాన్ని బుధవారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. నగరంలో ప్రముఖ పేరుగున్న తాజా కిచెన్ హోటల్‌వారు ప్రధాన రోడ్డులో ఉన్న ఫుట్‌పాత్‌ను కబ్జాచేసుకున్నారు. దీంతో గత నెల 24న కూడ ఇదే హోటల్ ముందు ఫుట్‌పాత్‌ను అధికారులు పాక్షికంగా తొలగించారు. దీంతో తాము తొలగించుకుంటామని హోటల్ వారు చెప్పడంతో వారు వెళ్లిపోయారు. వారం రోజులైనా కూడా ముందు బాగాన్ని హోటల్ యాజమాన్యం తొలగించకపోవడంతో వారు తిరిగి బుధవారం ప్రొక్లేనర్‌తో అక్రమ నిర్మాణాన్ని తొలగిం చారు. అంతకు ముందు మెట్టుగూడ ప్రధాన రోడ్డు ఆలుగడ్డ బావి వద్ద రోడ్డుపై ట్రాఫిక్‌కు ఇబ్బందిగా వెలసిన కూరగాయల చిరు వ్యాపారులు డబ్బాలను తొలగించారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రజిత, టిపిఎస్ సరిత సేన్ మాట్లాడుతూ మెట్టుగూడతో పాటు తార్నాకలో వెలసిన అక్రమ నిర్మాణాలను ఫిర్యాదులు అందడంతో కూల్చివేశామని చెప్పారు. ప్రభుత్వ నిభందనలకు విరుద్దంగా ఎవరు నిర్మాణాలు చేపట్టిన వాటిని తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కూల్చివేత కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చందు, ఆంజనేయులు, నాగయ్య, ప్రకాష్, మౌనిక, చంద్రశేకర్ తదితరులు పాల్గొన్నారు.



తార్నాక తాజా కిచెన్ హోటల్ అక్రమించిన ఫుట్‌పాత్‌ను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కుంభాభిషేకం

**పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

సంజీవరెడ్డినగర్, జనవరి 31, ప్రభాతవార్త : బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న కుంభాభిషేకం పూజలలో మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం పాల్గొన్నారు. ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కుంభాభిషేకం సందర్భంగా గత నాలుగు రోజుల నుండి శత చండీయాగం, హోమాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పూజలలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆలయ పండి తులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. పూజ లలో పాల్గొన్న అనంతరం వేదమంత్రాల లో పండితులు ఆయనకు ఆశీర్వచనం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ నామన శేషుకు మారి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈవో నాగరాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మం తరావు, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో కుంభాభిషేకం పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే..** పేద,మధ్యతరగతి ప్రజల సౌకర్యార్థమే ఎస్ఆర్ నగర్ అత్యాధునిక కమ్యూనిటి హాల్ నిర్మాణం చేపట్టినట్లు మాజీమంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. బుధవారం ఆయన ఎస్ఆర్ నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. డబుల్ సెల్లార్, జీప్లస్ ఒన్ విధానంలో సుమారు 11.92 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టినట్లు వివరించారు. కానీ పెరిగిన ధరల దృష్ట్యా 12.96కోట్ల రూపాయలను ఇప్పటి వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. డబుల్ సెల్లార్ పార్కింగ్ కోసం, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఫంక్షన్ హాల్, ఫస్ట్ ఫ్లోర్‌లో డైనింగ్ హాల్ ఉండే విధంగా డిజైన్ చేసిన నిర్మించినట్లు చెప్పారు. కరోనా కారణంగా నిర్మాణ పనులలో జాప్యం జరిగిందని తెలిపారు. నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు నిలిపివేయాల్సి వచ్చిందని అధికారులు ఆయనకు తెలిపారు. ఇంకా ఎలక్ట్రికల్, శానిటేషన్, పెయింటింగ్ తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని అధికారులు తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ కార్పోరేషన్ డియీ రాధాకృష్ణ, మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, ఈఈ ఇందిర, వాటర్ వర్క్స్ జిఎమ్ హరిశంకర్, కమిటి హాల్ అధ్యక్షులు నరసింహం, డివిజన్ అధ్యక్షులు హనుమంతరావు, కట్ట బలరాం, నరసింహ, శివ, సుమీత్ సింగ్, రాజేష్, ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## యువతలో ఉన్న విభిన్న ప్రతిభను వెలికితీయాల్సిన బాధ్యత కళా సంస్థలదే

చిక్కడపల్లి, జనవరి 31 ప్రభాతవార్త: యువతలో ఉన్న విభిన్న ప్రతిభను వెలికితీయాల్సి బాధ్యత కళాసంస్థలపైనే ఉందని సినీ టెలి కళాకార్ సేవాసమితి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రేఖశ్రీ, ఉపాధ్యక్షులు ఫాహిం సర్కార్, కోశాధికారి బి.ఉదయ్‌కుమార్ అన్నారు. విభాగాల్లో ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహించడమే తమ కర్తవ్యమని అన్నారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సినీ టెలి కళాకార్ సేవాసమితి హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమితి ఆవిర్భావ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు(కల్చరల్) వసియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్ని వయస్సులకు చెందిన వారు అద్భుతమైన పాటలను పాడి అందరి నుంచి ప్రశంసలు అందుకోవడవమే కాకుండా ఉత్తమ పాటలను ఎంపిక చేసి గానం చేసిన వారికి బహుమతులను అతిథుల చేతులమీదుగా అందించారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒయూ విద్యార్థి మృతి

తార్నాక, జనవరి 31 ప్రభాతవార్త: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి హాస్టల్లో పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘట ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కాశి కథనం ప్రకారం. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఎర్ర నవీన్(23) ఓ.యూ లో ఎంకాం సెకండియర్ చదువుతున్నాడు. ఇదిలా ఉండగా ఇటీల అతనికి ఆర్థిక సమస్యలు ఎక్కువ అయ్యాయి. దీంతో అతను అతను ఉండే హాస్టల్ గదిలో పురుగుల మందును బీర్‌లో కలుపుకొని అపస్మారక స్థితిలో కింద పడిపోయాడు. దీంతో తోటి విద్యార్థులు అతనిని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన విద్యార్థి ఎర్ర నవీన్( ఫైల్)

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

తార్నాక.. బైకుపై వేగంగా వెళ్లుతున్న ఓ యువకుడు ముల మలుపు వద్ద ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. లాలాపేట్‌కు చెందిన చంద్రశేకర్ కుమారుడు సాయివర్ధన్(25) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా రాత్రి లాలాపేట్ కమాన్ నుంచి మౌలాలి వైపు తన బైకుపై వెళ్లుతుండగా హెచ్‌పిపెట్రోల్ బంక్ వద్ద ఉన్న మూల మలుపు వద్ద స్కిడ్ అయి కిందపడిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో పోలీసులు మృత దేహాన్ని స్వాదీనం చేసుకొని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు.

## కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా మరో ఏడాది రామకృష్ణ పదవీ కాలం పొడిగింపు

కంటోన్మెంట్, జనవరి 31 ప్రభాతవార్త: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డును మరో ఏడాది పాటు పొడగించారు. ఈ మేరకు జాయింట్ సెక్రటరీ రాకేశ్ మిటల్ ఉత్తర్వాలను జారీ చేశారు. ప్రస్తుతం వేరేడ్ బోర్డు పదవీ కాలం ఫిబ్రవరి 10వ తేదినాటికి ముగియనుంది. తాజా ఉత్తర్వాలతో ప్రస్తుత వేరేడ్ బోర్డును వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగించనున్నారు. అంతకు ముందే కేంద్రం కంటోన్మెంట్ బోర్డులకు ఎన్నికలు నిర్వహిస్తే వేరేడ్ బోర్డు రద్దు కానుంది. మూడేళ్ల క్రితమే మనుగడలోకి వచ్చిన వేరేడ్ బోర్డును ఆరు నెలల చొప్పున ఆరు సార్లు పొడగిస్తూ వచ్చారు. తాజాగా ఏడాది పాటు వేరేడ్ బోర్డు పదవీ కాలాన్ని పొడగించడం గమనార్హం, ప్రస్తుత బోర్డులో బ్రిగేడియర్ సోమశంకర్, సీఈవో మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ సభ్యులుగా కొనసాగుతారు.

## పన్ను వసూల లక్ష్యాలను పూర్తి చేయాలి

**బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర**

నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో పన్ను వసూలు లక్ష్యాలను సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. బుధవారం కార్పోరేషన్ కార్యాలయంలో సిబ్బంది అందరికి సమావేశం ఏర్పాటు చేసి, పన్ను వసూలుపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఇంటి పన్ను, నాన్‌ట్యాక్స్, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్ ట్యాక్స్‌లు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలని, ప్రతి రోజూ మీరు ఎంత వసూలు చేశారో నాకు తెలుపాలని సూచించారు. ఆదాయార్జన కోసం అహర్నిషలు కష్టపడాలని తెలిపారు. కొంత మంది ఇప్పటికే 80శాతం వసూళ్లు చేశారని, మరికొంత మంది ఇంకా 60శాతం కూడా దాటలేదని, పనితీరును మెరుగు పర్చుకోవాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పనితీరును బట్టే అర్హతను కేటాయిస్తామని, సీనియర్లమని అప్పగించిన పనులు సకాలంలో పూర్తి చేయకపోతే ఊరుకునేది లేదన్నారు. సిబ్బంది అంతా కష్టపడి బండ్లగూడ కార్పోరేషన్ ఆదాయంను గణనీయంగా పెంచాలని, ఈ ప్రాంతంకు మంచి పేరు తీసుకు రావాలని కమీషనర్ శరత్‌చంద్ర తెలిపారు.





పన్ను వసూలు లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచిస్తున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ శరత్‌చంద్ర

## పుత్రుని పుట్టిన రోజు చేయలేదని..

**మనస్థాపంతో మహిళ ఆత్మహత్య**

కుత్బుల్లాపూర్, జనవరి 31, ప్రభాతవార్త: ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుమారుని పుట్టినరోజులు వేడుకలు చేయడం కుదరదని భర్త చెప్పడంతో భార్య మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుభాష్ నగర్‌లో నివాసం ఉంటున్న సురన్న నరసింహారెడ్డి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. 2017లో నాగ సత్యవేణితో నరసింహారెడ్డికి వివాహం అయ్యింది. ఇద్దరు కుమారులు జన్మించారు. మొదటి అబ్బాయి అభిరాంకు ఐదు సంవత్సరాలు కాగ, రెండో అబ్బాయి జ్ఞానేశ్వర్ కు మొదటి సంవత్సరం. అయితే చిన్న కుమారుడైన జ్ఞానేశ్వర్ పుట్టినరోజు ఉండగా పుట్టినరోజుకు బంగారు గొలుసు చేయించమని నాగ సత్యవేణి భర్తను కోరింది. ఆర్థికంగా కొంత ఇబ్బందిగా ఉందని భర్త నచ్చచెప్పినా వినలేదు. మనస్థాపం చెందిన నాగ సత్యవేణి మంగళవారం భర్త ఉద్యోగానికి వెళ్ళగా బెడ్రూం లోపలికి వెళ్ళి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

## పారిశుధ్య కార్మికురాలు లక్ష్మీకి జాతీయ ఉత్తమ ఆవార్డు

కొడంగల్,జనవరి 31ప్రభాతవార్త : జాతీయ స్దాయి ఉత్తమ పారిశుద్ద్య కార్మికురాలిగా కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామపంచాయతీ పారిశుద్ద్య కార్మికురాలిగా లక్ష్మీ ఆవార్డును అందుకున్నారు.మంగళారం దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా అమె ఆవార్డును అందుకున్నట్లు గ్రామసర్పంచ్ బి.పకీరప్ప తెలిపారు.ఈ సందర్బంగా జాతీయ స్దాయిలో ఉత్తమ ఆవార్డు అందుకోవడంతో లక్ష్మీని గ్రామసర్పంచ్ పకీరప్ప,వార్డు సభ్యులు,పంచాయతీ సిబ్బంది,గ్రామస్దులు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

## కంటోన్మెంట్‌లో నాయకులతో సమావేశమైన మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి



కంటోన్మెంట్, జనవరి 31 ప్రభాతవార్త: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బిజెపి టికెట్ కోసం మాజీ ఎంపీ చాడ సురేశ్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్ ఇందులో భాగంగా బుధవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి, తాడ్‌బండ్, డైమాండ్ పాయింట్, మారేడ్‌పల్లి, కార్కాన, పికెట్, తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లోని బిజెపి నాయకులతో సమావేశమన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2009లో వరంగల్ ఎంపీగా పనిచేసి ప్రజలకు అనేక సేవలు అందించామన్నారు. తెలంగాణ ఉద్యమంలో నాలుగు సంవత్సరాల పాటు నిరంతరంగా పనిచేశామన్నారు. 2019లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరడం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ ఇన్‌ఛార్జిగా పనిచేశామన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఇన్‌ఛార్జిగా పనిచేసి ఎమ్మెల్యే రఘునందన్ రావ్ విజయానికి కృషి చేశామన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానికుడిగా, పారిశ్రామిక వేత్తగా, రాజకీయ పరిజ్ఞానం కలిగి ఉన్న తనకు బిజెపి టికెట్ ఇస్తే విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంపనప్రతాప్, మేకల సారంగపాని, సి.హెచ్. కన్నాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నాలా ప్రక్షాళన వేగవంతం చేయండి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 31, ప్రభాతవార్త: రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న నాలల ప్రక్షాళన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిహెచ్ఎంసి అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్ పల్లి రంగదాముని చెరువు నుండి ప్రవహించే వర్షపు నీరు, డ్రైనేజీ నీరు స్వాన్‌లేక్ మీదుగా కూకట్‌పల్లి నాలాలో కలిసే మార్గంలో నాలా సరిగ్గా లేకపోవడం వలన భారీ వర్షాలు కురిసిన సమయంలో గత రెండు సంవత్సరాలుగా స్వాన్‌లేక్ ఆపార్ట్‌మెంట్‌లోని వర్షం నీరు చేరి దాదాపు 200 కార్ల వరకు మునిగిపోయాయని గుర్తు చేశారు. అదేవిధంగా ఈ నాల నుండి వచ్చే వర్షపునీరు వలన కూకట్‌పల్లి డిపో వద్ద నీరు నలిచిపోవడంతో బస్సుల రాకపోకలకు ఇబ్బందులు కలిగే విషయం గత రెండు సవత్సరాలుగా చూస్తూనే ఉన్నామన్నారు. ంలో నాలా పనులను పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో స్వామి, టౌన్‌ప్లానింగ్ సిపి ఉమాదేవి, ఏసిపి మల్లీశ్వర్, ఇరిగేషన్ ఈఈ నారాయణ, మాజీ కార్పోరేటర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఖేలో భారత్ స్పూర్తితో ప్లే ఫర్ మల్కాజిగిరి

**బిజెపి నేత మల్క కొమురయ్య**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మల్క కొమురయ్య

దుండిగల్, జనవరి 31 ప్రభాత వార్త: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపల్ క్రికెట్ గ్రౌండ్ లో పల్లవి ఫౌండేషన్ వారు నిర్వహించిన ప్లే ఫర్ మల్కాజిగిరి క్రికెట్ టోర్నమెంట్‌ను భాజపా సీనియర్ నాయకులు, పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్క కొము రయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. పోటీల్లో పాల్గొనే జట్లను పరిచయం చేసుకొని మొదటగా మల్లంపేట్ హైందవసేవ, గండిమైసమ్మ జట్టుకు నిర్వహించిన మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభిచారు. ఈసందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ మన దేశానికి ఉన్న అతి పెద్ద బలం యువత అన్నారు. యువతను ప్రోత్స హించడంలో భాగంగా ప్రధానిమంత్రి మోడీ ఖేలో ఇండియా అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చి యువతతో ఎన్నో అధ్భుతాలు చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆసియా గేమ్స్‌లో 107 పతకాలను భారత్ కైవసం చేసుకుందని అందులో 28బంగారు పతకాలు రావడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విక్రమ్, బిజెవైఎం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జోగరావు, రూరల్ జిల్లా కార్యదర్శి అతీష్‌బాబు, దుండిగల్ బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్, కెటిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

చిక్కడపల్లి, జనవరి 31 ప్రభాతవార్త: తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెస్ కోదండరామ్ ఎమ్మెల్సీ ఎన్నికను అడ్డుకుంటున్న కెసిఆర్ కుట్రలను నిరసిస్తూ తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కమిటీ కార్యకర్తలు, నాయకులు బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో కెసిఆర్, కెటిఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య మాట్లాడుతూ కోదండరామ్‌పై కెసిఆర్ కుట్రలు కొత్తేమి కాదని, గత 9 సంవత్సరాలుగా అనేక రకాలు దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు ఈ దిష్టిబొమ్మ దగ్ధం కార్యక్రమంలో తెలంగాణ జనసమితి ముషీరాబాద్ కన్వీనర్‌మెరుగు శ్రీనివాస్‌యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్, బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.జస్వంత్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం నాయకులు మధు, జైపాల్‌రెడ్డి, పులిపాటి సుధాకర్, అజయ్‌గౌడ్, వెంకటయనయ, కాకునూరి సుధాకర్, పవన్, సురేశ్; రసూల్, మాణిక్యం, సాయి, భాష తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎంపిగా పోటీ చేసే అవకాశం ఇవ్వండి

**రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి మల్లేష్ ముదిరాజ్**

నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త : చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసే అవకాశం నాకు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, రాజేంద్రనగర్ మండల మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్ బుధవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలో బిసిల జనాభా అధికంగా ఉందని, బిసిలలో ముదిరాజ్‌ల జనాభా ఎక్కువగా ఉందని, జనాభా దామాషా ప్రకారం ఈ సారి చేవెళ్ల ఎంపి స్థానంను ముదిరాజ్‌లకు కేటాయించాలని కేసీఆర్‌ను కోరినట్లు వివరించారు. గత దశాబ్ద కాలంగా బిఆర్ఎస్ కార్యకర్తగా, ఎంపిపిగా అంకిత భావంతో పార్టీ ఎదుగుదలకు, పార్టీ ఆదేశించిన కార్యక్రమాల విజయవంతానికి సైనికునిగా పని చేశానని తెలిపారు. నిబద్ధత, నిజాయతీగా ఎంపిపి బాధ్యతలు నిర్వర్తించి ప్రజల ఇబ్బందులు దూరం చేశానని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలు ప్రతీ ఒక్కరికి దక్కేలా చేశామన్నారు. ఐదేళ్ల ఎంపిపి పదవి ముగిసిన తరువాత ఎలాంటి బాధ్యత ఇవ్వకపోయిన గులాబీ జెండాను మోశామని, అసెంబ్లీ ఎన్నికల్లో రేయింబవళ్లు కష్టపడి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మళ్లీ ప్రకాశ్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకున్నామన్నారు. రంగారెడ్డి జిల్లాలో ముఖ్యంగా చేవెళ్ల పార్లమెంట్ గడ్డపై అన్ని కుల సంఘాల ప్రజలతో నాకు మంచి సంబంధాలున్నాయని, ఈ దఫా బీసీనైన నాకు ఎంపిగా పోటీ చేసే అవకాశం ఇస్తే, గెలిచి చూపిస్తానని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కోరినట్లు మల్లేష్ ముదిరాజ్ తెలిపారు. ఇందుకు పార్టీ అధినేత కేసీఆర్ సైతం ఈ అంశంపై ఆలోచిస్తామని భరోసా ఇచ్చారని మల్లేష్ ముదిరాజ్ వివరించారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, స్టాఫ్ నర్సులను రెగ్యూలరైజ్ చేయాలి



నర్సులతో కలిసి మాట్లాడుతున్న డాక్టర్ షేక్ ఇస్లాముద్దీన్, సత్తర్

హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త: నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌మెచ్‌ఎం) కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను స్పెషల్ కేటగిరీ కింద రెగ్యూలరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌ఎం స్టాఫ్ నర్సులు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత పదిసంవత్సరాలుగా సిహెచ్‌సి, పిహెచ్‌సి, యుపిహెచ్‌సి వంటి వివిధ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలన్నారు. ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్‌ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ షేక్ ఇస్లాముద్దీన్, ఆల్‌ఇండియా దళిత్ ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు సత్తర్ సాహెబ్‌లు పలువురు స్టాఫ్ నర్సులతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో క్వాలిఫై కావడమే కాకుండా కొవిడ్ కష్టకాలంలో ఎంతో సేవలందించారన్నారు. ఇలాంటి వారిని కొత్తవారితో సమానంగా రెగ్యూలరైజ్ చేసి నష్టపోకుండా చూడాలన్నారు. వీరు సెలెక్ట్ అయినప్పటికీ జోనల్ పరంగా నష్టపోయారన్నారు. ఏఎన్ఎంల వయోపరిమితి 52ఏళ్లకు పెంచిన విధంగానే స్టాఫ్‌నర్సుల వయోపరిమితిని కకూడా పెంచాలన్నారు. గత ప్రభుత్వం స్టాఫ్ నర్సులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నర్సులు చైతన్య, సౌజన్య, మంజుల, నిర్మలతోపాటు సుమారు వందమంది పాల్గొన్నారు.

## ఎల్‌బి స్టేడియంలో స్టాఫ్ నర్సుల సభ

సైఫాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించబడిన స్టాఫ్ నర్సులకు నియామకపత్రాలను అందించే కార్యక్రమం సభ బుధవారం సాయంత్రం బషీర్‌బాగ్‌లోని లాల్ బహుదూర్ (ఎల్‌బి) స్టేడియంలో ఘనంగా జరిగింది. వేలాది మంది నర్సులు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గుంపులు, గుంపులుగా తరలివచ్చారు. బస్‌లు, కార్లు, ద్వీచక్రవాహనాలలో తెల్లటి డ్రస్‌లు ధరించి హుం దాగా గుర్తింపు కార్డులతో స్టేడియంలోకి తరలివెళ్లారు. గుర్తింపు కార్డులు ఉన్న నర్సులను మాత్రమే పోలీసులు స్టేడియంలోకి అనుమతించారు. స్టాఫ్ నర్సులు ఎంతో శాంతియుతంగా తరలి వచ్చారు. భార్య, భర్తలు, పిల్లల తల్లులతో సహా స్డేడియం లోపల వెళ్ళడం జరిగింది. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుంది



చెక్కును అందజేస్తున్న బండి రమేష్

బేగంపేట్, జనవరి 31 ప్రభాతవార్తః కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉందని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. ఇటీవల రోడ్డ ప్రమాదంలో మరణించిన నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్‌లో గల శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతానికి చెందిన యాదయ్య యాదవ్ కుటుంబానికి రూ. 2లక్షల ఇన్స్యూరెన్స్‌కు సంబంధించిన చెక్కును స్థానిక నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి బుధవారం బండి రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం పార్టీ పనిచేస్తుందని బేగంపేట డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఓడిపోయిన ప్రజలకు అండగా ఉంటూ నియోజవర్గం అభివృద్ధిలో పాలు పంచుకుంటాన న్నారు. ఈ కార్యాక్రమంలో రమేష్, జైపాల్, నర్సింహ్మా యాదవ్, రాధ తదితరులు పాల్గొన్నారు.

## రామ మందిరం వద్ద అన్నదానం

బేగంబజార్, జనవరి 31ప్రభాతవార్త: అయోధ్యలోని రామ మందిరం వద్ద అన్నదానం కార్యక్రమానికి ఫిబ్రవరి20వ తేది నుంచి భాగ్యనగర్ అయ్యప్పసేవా సమితి ఆద్వర్యంలో శ్రీకారం చుట్టనున్నట్లు భాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ,ప్రధాన కార్యదర్శి విజయ్‌బాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేష్‌లు తెలిపారు.ఈ మేరకు గత వారం రోజులుగా అయోధ్యలోని రామ మందిరం రాముని దర్శించుకున్నట్లు చెప్పారు. జాతీయ విహెచ్‌పి ఆర్గనైజింగ్ కార్యదర్శి కోటేశ్వరరావుశర్మతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించడంతో ఆలయం సమీపంలో అన్నదానం, అల్పహారం అందచేసేందుకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు.బాల రాముని దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతి రోజు వేలాదిమంది భక్తులు వస్తున్నట్లు చెప్పారు.ఫిబ్రవరి 20వ తేదిన ప్రారంభించేందుకుగా వివిధ ప్రాంతాల నుంచి 12మంది ప్రముఖులు హాజరువుతున్నట్లు వారు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, జనవరి 31 ప్రభాతవార్త: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా గురువారం(01-02-2024) గాగిల్లాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. చైతన్యకాలనీ, ఎఫ్2 ఫీడర్ల పరిధిలోని చైతన్యకాలనీ, చర్చిగాగిల్లాపూర్, గాగిల్లాపూర్ ఎక్స్‌రోడ్స్, సర్వేనంబర్ 214లోని కాలనీలు, గ్రీన్‌వుడ్‌విల్లాస్, గాగిల్లాపూర్ గ్రామం, డ్రీమ్‌వన్‌విల్లాస్, ప్రధానరహదారికి ఇరువైపుల ఉదయం 10గంల నుండి మధ్యాహ్నం 12గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

కొంపల్లి.. ఐడిఏ 2 ఫీడర్‌లోని పారిశ్రామిక ప్రాంతంలో నేడు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు దూలపల్లి గ్రామం, అశోక్ అలా మైసన్ 1, సెయింట్ మార్టిన్ కాలేజ్ రోడ్ అలాగే స్టీల్ సిటీ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పారిశ్రామిక ప్రాంతం, హనుమాన్ వంతెన రహదారి, చైదరి వంతెన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలియజేశారు.

నిజాంపేట్.. చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా నేడు 11కేవీ శ్రీహోమ్స్ కాలనీ ఫీడర్‌లో ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12.20 గంటల వరకు అలాగే 11కేవీ ఫీడర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు రైసినియా, మమత హాస్పిటల్, బొల్లారం ఏరియాపై ప్రాంతాలలో తాత్కలికంగా విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు, ఇందుకు ప్రజలు సహకరించాలని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమంలో భాగంగా నేడు వాసవి లేఅవుట్, కొత్త విజేత సూపర్ మార్కెట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జగన్ స్టూడియో, విష్ణు ప్రియా నగర్, ఎన్ఆర్ఐ కాలనీ ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తాత్కలికంగా విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు ప్రజలు సహకరించాలని ప్రగతి నగర్ ఏఈ విజ్ఞప్తి చేశారు.

## శంకరమఠంలో వైభవంగా హరికథా మహోత్సవాలు

నాంపల్లి, జనవరి 31 ప్రభాతవార్త : కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శ్రీ శృంగేరి శంకరమఠం నల్లకుంట హైదరాబాద్‌లో ఫిబ్రవరి 1 నుండి 7వరకు ప్రతీరోజూ రాత్రి 6గంటల నుండి హరికథా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్ మీడియాకు తెలిపారు. అలనాటి హరికథలను కాపాడుకుంటూ భాగవతార్‌లను ప్రోత్సహించే సదుద్దేశంతో నిర్వహిస్తున్న హరికథా మహోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 1 గురువారం తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హరికథా మహోత్సవాలను ప్రారంభిస్తారని, డా. సప్పాభారతి-ఏలూరు భాగవతారిణిచే శివలీలలు హరికథాగానం ఉంటుందని; 2న గజేంద్రమోక్షం; 3న వినాయక విజయం; 4న మహాకవి కాళిదాసు; 5న శ్రీనివాస కళ్యాణం; 6న భక్తమార్కండేయ; ఆఖరిరోజు 7 బుధవారం గరిమెళ్ల సత్యవతి-మదనపల్లి భాగవతారిణిచే సీతారామ కళ్యాణం హరికథాగానం ఉంటాయని, ఈ హరికథా మహోత్సవాలను డా. కె.వి.రమణాచారి 72వ జన్మదిన సందర్భంగా నిర్వహిస్తున్నామని, ఈ మహోత్సవ ముగింపు సభకు తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును ముఖ్యఅతిథిగా నేడు ఆహ్వానించినట్లు, ఆయన డా. కె.వి.రమణాచారిని ఘనంగా సత్కరిస్తారని, అధికసంఖ్యలో హరికథా ప్రియులు విచ్చేసి భాగవతార్‌లను ప్రోత్సహించి హరికథా మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## మోడీ హఠావో దేశ్‌కు బచావో నినాదంతో 100 ఎంపి స్థానాలకు పోటి

**డిబిపి జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి ప్రకటన**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

సైఫాబాద్, జనవరి 31 ప్రభాతవార్త: ప్రధాని 'నరేంద్రమోదీ సర్కార్ హఠావో దేశ్‌కు బచావో' అనే నినాదంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా వందకుపైగా స్థానాల్లో పోటీ చేస్తున్నామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ ప్రకటించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, యుపి, ఢిల్లీ తదితర రాష్ట్రాలలో తమ అభ్యర్థులను ఎన్నికల భరిలోకి దించుతున్నామని చెప్పారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తూ మేజారిటి ప్రజలను బానిసలుగా మార్చుతున్నదని, ప్రజల ఆస్తులైన దేశ సంపదను అంబాని, అదానీ మార్వాడి కార్పోరేట్ దోపిడి వర్గాలకు దోచిపెడుతున్నదని ఆరోపించారు. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం, అంబేద్కర్ రాజ్యాంగాన్ని ప్రక్కనపెట్టి మనుస్మృతి కాషాయి రాజ్యాంగాన్ని బిజెపి సర్కార్ అమలు చేస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. ఈ తరుణంలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ప్రజలు ముందుకు సాగాలని ఆయ న పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఈవిఎంలను అడ్డుపెట్టుకుని మోదీ ప్రభుత్వం తిరిగి ఎన్నికల్లో గెలిచేందకు కుటిల ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఈవిఎంలను రద్దు చేసి బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలను నిర్వహించాలని కోరారు. త్వరలో ఎన్నికల కమిషన్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన ఐదు లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి షేక్ భాషా, సికింద్రాబాద్ నుంచి జె.ఎన్.రావు, మహబూబాద్ నుంచి ఎం.రవీందర్‌నాయక్, చేవేళ్ళ నుంచి డా.వి.ఎల్.రాజు, మల్కాజ్‌గిరి నుంచి వడ్డే శ్రీనివాసరావు పోటి చేస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బీరం సతీష్, ఇటికాల గణేష్, చిప్పరి సుబ్బారావు, అజయ్, వినోద్, రవీందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ శిబిరాలకు వెళ్లి సేవలు




జాతీయ శిబిరాలకు వెళ్లిన ఒ.యూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ప్రోగ్రాం కోఆర్డీనేటర్ సవీన్ సాద

తార్నాక, జనవరి 31 ప్రభాతవార్త: ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నాలుగోవ జాతీయ శిబిరాలైనటువంటి జాతీయ సమైఖ్యత శిబిరాలకు వెళ్లిన ప్రోగ్రాం ఆపీసర్లు, వాలింటీర్లను ఉస్మానియా విశ్వవిధ్యాలయంలో బుధవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డీనేటర్ సవీన్ సాద అభినందించారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాతీయ యువ శిబిరంలో డా. జగదీశ్వర్ ఆద్వర్యంలో 10 మంది వాలంటీర్లు మధురై, తమిళనాడులోని కామరాజు,విశ్వవిధ్యాలయంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో డా.బి.శోభారాణి మరో 10 మంది వాలింటీర్లు ఎంఎల్ఆర్ఐటీ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైఖ్యత శిబిరంలో డా. జాహేదా ఆద్వర్యంలో 6 వాలింటీర్లు మహరాష్ట్ర నాసిక్‌లో జరిగిన జాతీయ యువజన ఉత్సవం డా.చినబాబు ఆద్వర్యంలో నలుగురు వాలింటీర్లు పాల్గొని ఒ.యూ కీర్తి ప్రతిష్టలను ఎగుర వేయడంతో పాటు వివిధ అంశాల్లో ఉస్మానియా వాలింటీరు ముందున్నారని ప్రోగ్రాం కోఆర్డీనేటర్ ప్రొ.సవీన్ సాద, వైస్ చాన్సలర్ ప్రొ.రవీందర్, రిజిస్టార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతరం వారు విద్యార్థులను అభినందించారు.

## నేరాల అదుపునకు ప్రజలు సహకరించాలి

**అల్లాపూర్ సిఐ ఆంజనేయులు**



వివేకానంద నగర్ శ్రీసాయి చైతన్య పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సిఐ ఆంజనేయులు

యూసుఫ్‌గూడ, జనవరి 31, ప్రభాతవార్త : ప్రతి పౌరుడు సమాజంలో నేరాలను అదుపు చేసేందుకు పోలీసులకు తగిన విధంగా సహకరించే విధంగా ఉండాలని అల్లాపూర్ సిఐ ఆంజనేయులు అన్నారు. బుధవారం వివేకానంద నగర్ కాలనీలోని శ్రీసాయి చైతన్య హైస్కూల్‌లో పోలీసులు సమాజానికి ప్రజలకు అందించే సేవలను వారి విధులను విద్యార్థులకు వివరించారు.అదేవిధంగా నేరాలు అసలు ఎందుకు జరుగుతాయి. వాటిని ముందుగా ఎలా అరికట్టాలి ఎటువంటి నేరాలకు ఎటువంటి శిక్షలు పడతాయి విద్యార్థులందరు నేర్చుకోవాల్సినది ఏమిటి అనేది వివరంగా వారికి అవగాహన కల్పించారు. విద్యార్థులు ఏదైన తప్పు జరిగినపుడు వెంటనే స్పందించి దానిని ఖండించి పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.సమాజంలో జరిగే అన్యాయాలను అక్రమాలను ప్రశ్నించే దమ్ము, ధైర్యం, అలవరుచుకోవాలని సూచించారు. ఈసందర్భంగా శ్రీసాయిచైతన్య హైస్కూల్ కరెస్పాండెంట్ ఎమ్.శ్రీనువాస్ సిఐని శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

## సంగీతం నేర్చుకోవడం ద్వారా జన్మ తరిస్తుంది

**సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి**



సంగీత కళాకారులను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, జనవరి 31 ప్రభాతవార్త: సంగీతం ద్వారా జన్మ తరిస్తుందని సిబిఐ కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో 'గానసభ, సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్' నిర్వహణలో త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాలు గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి ఆధ్వర్యంలో బుధవారం రెండవ రోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జస్టిస్ నాగమారుతి శర్మ హాజరై ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగమారుతిశర్మ మాట్లాడుతూ సంగీతంలో రాణిస్తున్నారంటే అది భగవంతుడి కృప ఉంటేనే సాధ్యమవుతుందన్నారు. సంగీత గురువు డాక్టర్ వై.రమాప్రభ, గానసభ సంయుక్త కార్యదర్శి బండి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత గురువు రమాప్రభ బృందం ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనల గోష్ఠి గాన కార్యక్రమం జరిగింది.

## సంచారపురి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : జంపనప్రతాప్

కంటోన్మెంట్,జనవరి 31 ప్రభాతవార్త: ప్రతి మనిషి క్రీడల్లో పాల్గొంటే వ్యాయామం చేసినట్లు ఉండడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. 1వ వార్డులోని సంచార పురి కాలనీ పార్కులో తమ సొంత నిధులతో ఏర్పాటు చేసిన షెటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్‌తో పాటు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తెచ్చి నిధులు విడుదల అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను స్వాధీనం చేసుకోవాలని వినతి



అప్జల్‌గంజ్,జనవరి 31ప్రభాతవార్త: దేవాదాయ ధర్మాశాఖకు చెందిన మహాదేవ్ టెంపుల్‌లో అక్రమ కట్టడాలను నిర్మించారని వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనర్ అనిల్‌కుమార్‌ను భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త కలిసి వినతిపత్రం అందచేశారు.ఈస్థలం దేవాదాయశాఖకు సంబంధించిన స్థలమని న్యాయస్థానం కూడా తీర్పును వెల్లడించినట్లు చెప్పారు. ద్రేవాదాయశాఖకు చెందిన స్థలాన్ని పరిరక్షించేందుకుగాను కృషి చేస్తానని కమీషనర్ అనిల్‌కుమార్ హామి ఇచ్చినట్లు చెప్పారు.

### మెబైల్ ఐ హెల్త్‌కేర్ యూనిట్ ప్రారంభం

హైదరాబాద్, జనవరి 31,ప్రభాతవార్త: డిఇషా ఇండియా ఆధ్వర్యంలో మొబైల్ ఐ హెల్త్‌కేర్ యూనిట్‌ను ప్రారంభమైంది. జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో సైట్ సేవర్స్ ఇండియా భాగస్వామ్యంతో దీన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు డిషాఈ సభ్యులు చరిత్ర, మెహతా, చైతన్య తెలిపారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో ఈమొబైల్ యూనిట్‌ను ప్రారంభించామన్నారు. ఈమొబైల్ సేవలద్వారా హైదరాబాద్ చుట్టుపక్కల నివసించే పేదలకు ప్రాథమిక కంటి ఆరోగ్యసేవలను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు ఈకార్యక్రమంలో ప్రసన్నకుమార్, డాక్టర్ సర్వేపల్లి విజయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### విజ్ఞానం పెంపొందించేందుకు విహారయాత్ర దోహదం

కొడంగల్,జనవరి 31ప్రభాతవార్త : విద్యార్దులకు విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు విహారయాత్రలు ఎంతో దోహదపడుతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లూరి క్రాంతికుమార్ అన్నారు.బుధవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాల విద్యార్దులను విహారయాత్ర నిమిత్తం మహబుబ్‌నగర్‌లోని పిల్లలమర్రి,మయూరి పార్కు,మన్యంకొండ తదితర ప్రాంతాలకు వెళ్ళారు.ఈ సందర్భంగా పిల్లల మర్రిలోని వృక్షాలు తదితర వాటి విశేషాలను తెలిపారు.

## శాంతిభద్రతల స్థాపనలో ప్రజలందరిని భాగస్వాములను చేస్తా

**నార్సింగి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హరికృష్ణారెడ్డి**



నార్సింగి, జనవరి 31 ప్రభాతవార్త : శాంతి భద్రతల స్థాపనలో ప్రజలందరిని భాగస్వాములను చేస్తానని నార్సింగి పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రతీ పౌరుడు యూనిఫాం లేని పోలీసేనని తెలిపారు. ప్రజలు మీ చుట్టు పక్కల జరిగే ఏ సంఘ విద్రోహ చర్యను గమనించినా వెంటనే 100కు గాని, నార్సింగి పోలీసు స్టేషన్‌కు గాని ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మాకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామన్నారు. అపరిచిత వ్యక్తులు గాని, అనుమానాస్పద వస్తువులుగాని కనిపిస్తే వెంటనే మా దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రజలు ఎవరి మతాలను వారు ఆచరిస్తూనే ఇతర మతాలను గౌరవించినప్పుడే సోదర భావం పరిఢవిల్లుతుందన్నారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని, ప్రజలు వీటి పట్ల అప్రమత్తంగా మెలుగాలన్నారు. ఫోన్‌లు చేసి ఎవరు లోన్‌లు ఇస్తున్నామని, గిఫ్టులు వచ్చాయని, లాటరీ తగిలిందని ఓటీపీలు తెలుపాలని అడిగినా చెప్పవద్దని సూచించారు. మీ బ్యాంకు అధికారులైతే ఫోన్‌లలో ఓటీపీలు అడుగరని, నేరుగా బ్యాంకులకే రావాలని తెలుపుతారన్నారు. మీ ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పవద్దన్నారు. కోట్ల రూపాయలు పెట్టి ఇళ్లు కొంటున్న ప్రజలు కేవలం 20.వేలు పెట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంలో అశ్రద్ధ చేస్తున్నారన్నారన్నారు. ఒక్కో సీసీ కెమెరా 100.మంది పోలీసులతో సమానమైన నిఘాను పెడుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వాహనానికి స్టిక్కర్‌ను అంటిస్తున్న సతీష్ రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 31, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత్ జోడో యాత్రకు సంబంధించిన వాహనాల స్టిక్కర్‌ను శేరి సతీష్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్రను అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. కూకట్‌పల్లిలో కూడా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంజీవరావు, అరవింద్‌రెడ్డి, సిద్దు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు



నిజాంపేట్, జనవరి 31, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కో ఆపరేషన్, హ్యాండ్లూమ్స్ అండు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, గణేష్, ప్రభాకర్, రవీందర్, బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధే ధ్యేయం



సిసిరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్లు

దుండిగల్, జనవరి 31 ప్రభాతవార్త: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట 23వ వార్డులో రూ,42లక్షలతో డ్రైనేజీ, రూ,25లక్షలతో సిసిరోడ్డు, 2వ వార్డులోని శ్రీసాయి సంకల్పకాలనీలో రూ,12లక్షలతో సిసిరోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కౌన్సిలర్లు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా వార్డుల్లో ప్రజావసరాలకు అనుగుణంగా మౌళిక వసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, వెంకటేశ్, జక్కుల క్రిష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, కమీషనర్ సత్యానారాయణ, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## హస్నాబాద్ చెర్వుతూంకు మరమ్మత్తులు చేపట్టాలి

కొడంగల్, జనవరి 31ప్రభాతవార్త : మండల పరిధిలోని హస్నాబాద్ పెద్ద చెర్వుకు ఉన్న పెద్ద తూంకు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్దులు టీ.భీమయ్య, మల్లిఖార్జున్ తదితరులు కోరారు. ఈ మేరకు బుధవారం చెర్వుతూంను నీటిపారుదల శాఖ అధికారులు కిరణ్‌తో కలిసి పరిశీలించారు. పెద్ద చెర్వుతూం లీకేజీల కారణంగా నీరు వృధాగా పోతుందని, ఇందుకుగాను తక్షణమే చెర్వుతూంకు మరమ్మత్తులు చేపట్టాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మండలంలోని అధిక ఆయకట్టుగా పేరున్న హస్నాబాద్ పెద్ద చెర్వుతూం లీకేజీల కారణంగా నీరు పారుతుండడంతో పంటలకు నీరు అందక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, ఇందుకుగాను చెర్వుతూంకు మర మ్మత్తు పనులు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు.



నార్సింగి మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న భవన నిర్మాణాలను పరిశీలస్తున్న టౌన్‌ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ నర్సిహ్మారెడ్డి, కమీషనర్ సురేందర్‌రెడ్డి తదితరులు.

## గ్రామాలను ఐదేండ్లలో సర్పంచ్‌లు ఎంతో అభివృద్ధి చేశారు

కీసర, జనవరి 31, ప్రభాతవార్త : నియోజకవర్గంలోని గ్రామాలను ఐదు ఏండ్లలో ఎంతో అభివృద్ది చేశారని రాష్ట్ర మాజీ కార్మిఖ శాఖ మంత్రి, మేడ్చల్ నియోకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఏప్రిల్ 1తో సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో బుదవారం శామీర్‌పేట్ మండలం అలియాబాద్ ఏ ఫంక్షన్ హాల్‌లో పదవి విరమణ సభను నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చామకూర భద్రారెడ్డి ఆద్వర్యంలో గోదుమకుంట సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డికి పదవి విరమణ అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, వార్డు సభ్యులు పుట్ట బాలరాజు గౌడ్ పాల్గొన్నారు.

## జిల్లాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ప్లీడర్లుకు నెల, నెలా వేతనాలు చెల్లించాలి

**తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ సిఎంకు విజ్ఞప్తి**

సైఫాబాద్, జనవరి 31 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కోర్టులలో పనిచేస్తున్న ప్రభుత్వ ప్లీడర్లు, అసిస్టెంట్ ప్లీడర్లకు నెల, నెల వేతనాలు సకాలంలో చెల్లించాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది కె.వినయ్‌కిషోర్‌యాదవ్ సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టులో ప్రభుత్వం తరపున వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్లీడర్లు, అసిస్టెంట్ ప్లీడర్లుకు ఏ నెలకు ఆ నెల జీతం సకాలంలో అందుతున్నాయని, కాని జిల్లా కోర్టులలో పనిచేస్తున్న ప్లీడర్లు, అసిసెంట్ ప్లీడర్లుకు మాత్రం మూడు నెలల నుంచి 6 నెలల వరకు వేతనాలు అందడం లేదని, ఒక్కొక్క సారి ఏడాది కూడా పడుతున్నదని, దీంతో వారు ఆనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి నేటి వరకు ఇదే పద్దతి కొనసాగుతున్నదని, తెలంగాణ రాష్ట్రం వచ్చి పది సంవత్సరాలు గడిచినా ఈ పద్దతిలో ఏలాంటి మార్పు లేదని, ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మార్పు తీసుకురావాలని, ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాదులు సిరిగిరి ప్రభాకర్, పి.ప్రమోద్, వేణుగోపాల్, సుభాషిణి, హరిణి తదితరులు పాల్గొన్నారు.

## సంచార జాతులకు బడ్జెట్‌లో 1000 కోట్లు కేటాయించాలి

**సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన నిమ్మల వీరన్న**

సైఫాబాద్, జనవరి 31 ప్రభాతవార్త: వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో సంచార జాతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో 1000 కోట్లు కేటాయించి అదుకోవాలని, ఇలా ప్రతి ఏడాది కేటాయించాలని తెలంగాణ సంచార జాతుల సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మల వీరన్న సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సంచార జాతులు స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరువాత కూడా విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలలో ఎంతో వెనుకబడి దుర్భర దారిద్ర్య జీవితాన్ని గడుపుతున్నందున ప్రత్యేకంగా ఐదు శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, కామారెడ్డిలో జరిగిన బిసి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టి పది శాతం రిజర్వేషన్‌లను స్థానిక సంస్థల్లో కేటాయించాలని, ఎంబిసి కులాల అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక మంత్రిని నియమించాలని, బిసిలకు ప్రభుత్వం సహకరిస్తున్న మాదిరిగానే సామాజికంగా, ఆర్థికంగా న్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచన ఆరు గ్యారంటీలలో చేయూత పథకాన్ని సంచార జాతులకు వర్తింపజేయాలని, తమ జాతి బిడ్డల రక్షణకు నెలకు 12 వేల రూపాయలు గౌరవ వేతనం ఇచ్చి అదుకోవాలని ఆయన సిఎంకు విజ్ఞప్తి చేశారు.

## అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే : ఎమ్మెల్యే వివేకానంద



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

పేట్‌బషీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త : అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి కృపతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. బుధవారం 129 సూరారం డివిజన్ శివాలయ నగర్‌లో శేఖర్ మహారాజ్ పర్యవేక్షణలో గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగదాంబ దేవి వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మంత్రి సత్యానారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, పూజారి దుర్గా మహారాజ్, భూపాల్ నాయక్, ఛత్రునాయక్, లక్ష్మణ్ నాయక్, సీరాలాల్, సరితానాయక్, బలాసింగ్ నాయక్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలల సమస్యల పరిష్కారం కోసం సిఎం కలుస్తా

**టిపిజేఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా గౌరీసతీష్ గెలుపు**



తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలయాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్‌ను సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి, జనవరి 31 ప్రభాతవార్త: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవ సారి గౌరీ సతీష్ గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా విష్ణువర్దన్‌రెడ్డి ఎన్నికయ్యారు. మొత్తం ఓట్లు 53 కాగా అందులో పోల్ అయి నవి 52. తన సమీప ప్రత్యర్థి జగదీష్‌కు 9 ఓట్లు రాగా గౌరీసతీష్‌కు 40 ఓట్లు పోల్ అయ్యాయి. దీంతో 31 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వరదారెడ్డి, డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, అప్సర్‌పాషా ప్రకటించారు. అనంతరం గౌరీసతీష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల సమస్యలను పరిష్కరిం చేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గత రెండేళ్ళ కాలంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కళాశాలల సమస్యల పరిష్కారం కోసం త్వరలో సిఎం రేవంత్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిలను కలిసి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిజేఎంఏ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ



కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 31, ప్రభాతవార్త: వివేకానందనగర్‌లోని వడ్డేపల్లి రాజేశ్వరరావు గృహంలో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆవిష్కరించారు. అంతకుముందు సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాజం సభ్యులు నూతన డైరీని వడ్డేపల్లి రాజేశ్వరరావుకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు అల్లి భద్రన్న, ఉపాధ్యక్షులు బి.నర్సింలు, ప్రధాన కార్యదిర్శ డాక్టర్ సుఖశాంత్, కోశాధికారి ఎన్.శివశంకర్, ఎం. మాణిక్యం, ఏ.దిలీప్, ముద్ద మల్లికార్జున్, ఎస్.బసవరాజ్, జి.నాగశెట్టి, బసన్నగౌడ్ పాల్గొన్నారు.

### మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

వికారాబాద్, జనవరి 31, ప్రభాతవార్త ః మానవ వనరులను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆకాంక్షించారు. జిల్లాలో మహిళా సంఘాల ఆర్థిక పురోగతి, సంఘాల పనితీరు, రుణాల సద్వినియోగంపై వికారాబాద్ స్త్రీ శక్తి భవన్ లో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు.


వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ **I, BAIRU BALA ABHIRAM** S/o. BAIRU RAGHURAM R/o. H.No. 1-4-86, Bholakpur, Musheerabad, Hyd. Have Changed My Name as **"B.R.BALA ABHIRAM".**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## సోమేష్‌కుమార్ ఆస్తులపై సమగ్ర విచారణ జరిపించాలి

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**



సమావేశంలో ప్రసంగిస్తున్న టీడీపీ నేత పి.సాయిబాబా

ముషీరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, రేరా ఛైర్మన్ సోమేష్ కుమార్ అక్రమాస్థులపై సమగ్ర విచారణ జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయన ఆస్థులను జప్తు చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయి బాబా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీ క్యాడర్‌కు చెందిన సోమేష్‌కుమార్‌ను తెలంగాణ హైకోర్టు తీర్పును భేఖాతరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించిందని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ప్రముఖుడిగా కొనసాగుతూ పైరవీలతో, తప్పుడు సలహాలతో అవినీతి, అక్రమాలకు అడ్డాగా మార్చి, ప్రజాధనాన్ని విచ్చల విడిగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రెవెన్యూ సెక్రటరీగా బాద్యతలు చేపట్టి ధరణి పోర్టల్‌ను రూపొందించి, తద్వారా వేల ఎకరాల భూమిని అక్రమంగా సంపాదించారని ధ్వజమెత్తారు. రేరా డైరెక్టర్‌గా బాలకృష్ణ పనిచేసిన సమయంలోనే సోమేష్‌కుమార్ రేరా ఛైర్మన్‌గా పనిచేశారని గుర్తు చేశారు. వీరిద్దరూ ఒకేసారి రేరాలో కొనసాగటంపై పలు అనుమానాలున్నాయని, రంగారెడ్డి జిల్లా యాచారం మండలం కొత్తపల్లి రెవెన్యూ పరిధిలో పట్టాదారు డాక్టర్ జ్ఞానముద్ర, భర్త పేరు సోమేష్‌కుమార్ పేరుతో 25.19 ఎకరాలు ఉన్నాయని, ఈ రకంగా అక్రమ సంపాదనతో తెలంగాణలోని వ్యవసాయ భూములను బీహార్ ఐఏఎస్ అధికారులు కొనుగోలు చేసి, అక్రమాస్తుల రూపంలో కూడబెట్టుకున్నారని ఆరోపించారు. ఢిల్లీలో ఉన్న డీఓపీటీలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భూములు కొనకూడదని, సోమేష్‌కుమార్ డీఓపీటీలో భూముల వివరాలు అందచేయలేదని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో అవకతవకలకు పాల్పడి, ఇష్టారీతిలో వ్యవహరించి, వేల కోట్లు అప్పులు తీసుకువచ్చి, జీహెచఎంసీని జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, నాగు నగేష్, జి.యాదగిరిరావు, ఎస్.ప్రకాష్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కొడంగల్, జనవరి 31ప్రభాతవార్త : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇందుకుగాను ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. మండల పరిధిలోని హస్నాబాద్‌లో రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి, గ్రామసర్పంచ్ బి.పకీరప్పలతో కలిసి ప్రారంబించారు. ఈ సందర్బంగా ఎంపీపీ మాట్లాడుతు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నదని, ఇందుకుగాను ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్దులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ పాలకవర్గానికి సన్మానం.. వీడ్కోలు

ఘట్‌కేసర్, జనవరి 31, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ మండలం ఘణాపూర్ గ్రామపంచాయతీ పాలకర్గానికి బుధవారం సిబ్బంది సన్మానం చేసి వీడ్కోలు పలికారు. సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి సునీత మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు సేవలు అందించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా కార్యదర్శి సునీత సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డితో పాటు ఎంపిటిసి గట్టగళ్ల రవి, ఉపసర్పంచ్ వేముల పరమేశ్‌గౌడ్, వార్డుసభ్యులు, కోఆప్షన్‌సభ్యులను శాలువాతో సన్మానించి జ్ఞాపికలను అందజేసి వీడ్కోలు పలికారు. ఘణాపూర్ గ్రామపంచాయతీలో పలు అభివృద్ది పనులు చేపట్టి ప్రజల సమస్యలను తీర్చామని సహకరించిన అందరికి సర్పంచ్ గోపాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. వార్డుసభ్యులు చిలుగూరి బాస్కర్, వేముల పద్మ, గుగులోత్ కాంతమ్మ, వర్ప పవన్‌నాయక్, వేముల శోభ, వేముల శ్వేత, కోఆప్షన్ సభ్యులు వట్టి ఇన్నారెడ్డి, నానావత్ సురేశ్‌నాయక్, పైళ్ల లత తదితరులు పాల్గొన్నారు.

## కాచవాని సింగారం గ్రామాభివృద్ధికి కృషి చేశా

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 31, ప్రభాత వార్త: సర్పంచ్‌గా గత అయిదేండ్ల పాటు సేవ చేయడం గొప్ప అనుభూతి కల్గించిందని కాచవాని సింగారం సర్పంచ్ కొంతం వెంకట్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారం పంచాయతీ సర్వసభ్య సమావేశం బుధవారం సర్పంచ్ వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగింది.

సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1 వ తేదితో ముగియనుండటంతో పంచాయతీ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా సర్పంచ్ మాట్లాడుతూ గత అయిదేండ్ల పాటు సర్పంచ్‌గా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని అన్నారు.

పెరుగుతున్న కాలనీలకు ఇంకా ఎంతో చేయాల్సి ఉందని అన్నారు. తనకు సర్పంచ్‌గా అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు సర్పంచ్ రుణపడి ఉంటానని అన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన అధికారులకు, వార్డు సభ్యులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశపు అనంతరం సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను శాలువా కప్పి ఘనంగా పంచాయతీ సిబ్బంది సత్కరించారు. వార్డు సభ్యులు తమ అనుభవాలను సమావేశంలో పంచుకున్నారు.

సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కర్రె జంగమ్మ, కార్యదర్శి డి. వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పగటిపూట మినీటిప్పర్లను నగరంలోకి అనుమతించాలి

**మినీ టిప్పర్ లారీ డ్రైవర్స్ అసోసియేషన్ డిమాండ్**



బంజారాహిల్స్‌లో నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త: పగటివేళల్లో నగరంలో టిప్పర్ లారీలు తిరగొద్దని పోలీసులు ఎపెట్టిన నిబంధనను ఎత్తివేయాలని గతంలో అమాదిరిగా అనుమతి ఇవ్వాలని టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. గ్రేటర్ వ్యాప్తంగా చపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం జూబ్లీహిల్స్ దేవకొండ నగర్ బిఎన్ఆర్ హిల్స్ వద్ద బంజారాహిల్స్ మినీటిప్పర్ లారీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో నిర్మాణ వ్యర్థాలు ,భవన నిర్మాణ వ్యర్థాలు తరలించేందుకు నగరంలో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, అలాగే రాత్రి మొత్తం అనుమతించేవారన్నారు. కానీ ఇప్పుడు మిటీ టిప్పర్ లారీలు పగటివేళ అసలు నగరంలోనే తిరగొద్దంటూ అధికారులు నిబంధనలు విధించడం సరికాదని అన్నారు. వీటిని నమ్ముకుని వందలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని బంజారాహిల్స్ మినీ టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ సాబేర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గిరి, నసీరుద్దీన్, నరేష్, వైస్ ప్రెసిడెంట్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 11న గచ్చిబౌలిలో రన్‌ఫర్ ఎగర్ల్ చైల్డ్



టీషర్ట్ ఆవిష్కరిస్తున్న దుర్గారెడ్డి, చేతన్, సప్నామహేరియా, డా.సుమలత తదితరులు

హైదరాబాద్, జనవరి 31, ప్రభాతవార్త: సేవా భారతి తెలంగాణ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11న "రన్‌ఫర్ ఎగర్ల్ చైల్డ్ "2024 పేరుతో గచ్చిబౌలి స్టేడియం వద్ద రన్‌ను నిర్వహించనున్నట్లు సేవా భారతి తెలంగాణ అధ్యక్షులు దుర్గారెడ్డి తెలిపారు. ఈమేరకు బుధవారం అమీర్‌పేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఫ్రీడం జీఎం చేతన్, గ్లోబల్ డేటా డైరెక్టర్ సప్నా మహేరియా, డాక్టర్ సుమలత లతో కలసి రన్‌పోస్టర్, టిషర్ట్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాటాన్లడుతూ కిశోరి వికాస్ (బాలిక సాధికారత)పై అవగాహాన కల్పించేందుకు ఈరన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11న (ఆదివారం) ఉదయం జరిగే 5కె, 10కె, 21కే రన్‌కు దాదాపు పదివేలమంది హాజరుకానున్నట్లు పేర్కొకన్నారు తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మురికివాడలు, బస్తీలలోని ఆడపిల్లలకు విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి ,వృత్తిలో మార్గదర్శకత్వం అందించడానికి 363కిశోరీ వికాస్ కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

తాండూరు, జనవరి 31, ప్రభాతవార్త : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహార్‌రెడ్డి తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి హాజరయ్యారు. 253మంది లబ్దిదారులకు సుమారు రూ. 2కోట్ల53లక్షల విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీ ముభారక్ చెక్కులకు ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో భాగంగా ఆరు గ్యారెంటీ పథకాలను ప్రకటించిందని గుర్తు చేశారు. పేదింటి ఆడపడుచు పెళ్లి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.లక్ష నగదుతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని ప్రకటించారని అన్నారు. ఇచ్చి మాట ప్రకారం ప్రభుత్వం ఖచ్చితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనితాగౌడ్, వైస్ ఎంపీపీ స్వరూప, పీఏసిఎస్ చైర్మన్ రవిగౌడ్, తహసిల్దార్ తారాసింగ్, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

క్ర.సం.1. నిట్ సం. 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన సం. 12/SE(H)/GHMC/2023-24, తేది: 30.01.2024. పనిపేరు: లిఫ్టులు & DG సెట్టు రీకండిషనింగ్. అంచనా మొత్తం (రూ.లక్షలలో) : 145.44. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: ప్రారంభ తేదీ: 01.02.2024 సా.4.00గం. చివరి తేదీ: 08.02.2024 మ.3.30గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం (హౌసింగ్) GHMC, 3వ అంతస్తు, మునిసిపల్ బిల్డింగ్, హరిహర కళాభవన్, సికింద్రాబాద్-500003. ఏవైనా విచారణలకు శ్రీ ఆర్ శ్రావణ్ కుమార్, డిప్యూటీ, EE (H) GHMC సెల్ నం. 9000115395. ఇ-మెయిల్ id:se12bhkhousing@gmail.com మొత్తం 03 పనులు. అంచనా మొత్తం (రూ.లక్షలలో 145.44. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (హౌసింగ్), GHMC.

DIPR.No.9897-PP/CL/Advt/1/2023-24 తేదీ: 31.01.2024

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
GHMC

నిట్ సం. 36/SE/KPZ/GHMC/2023-24 తేది: 30.01.2024

పనిపేరు: పూడిక తీయుట. అంచనా మొత్తం/ECV (రూ.లక్షలలో) 63.40. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 31.01.2024 ఉ.11.00గం. 03.02.2024. ఉ.11.00గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: SE/KPZ, GHMC, 9989930363.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, కూకట్‌పల్లి జోన్, GHMC.

DIPR.No.9907-PP/CL/Advt/1/2023-24 తేదీ: 31.01.2024



**PUBLIC NOTICE**

Under the Instructions of My Clients i.e., **1. ATUL NAIK S/0 ASHOK NAIK,** Aged about; 36 years, Occ; Pvt Employee, R/o. H.No. 23-6-846, Chandu Lal Bela, Opp Indane Gas, Sudha Talkies, Shah Ali Banda, Hyderabad. **2. ROHIT NAIK S/O ASHOK NAIK,** aged about; 30 years, Occ; Profession, R/o. H. No. 23-6-846, Chandu Lal Bela, Opp Indane Gas, Sudha Talkies, Shah Ali Banda, Hyderabad is hereby intending to purchase the Property i.e., Housing Bearing Municipal No., H. No. 23-5-1034 & 1048/1(old Portion of house Nos. 23-5-1034 and 1048), admeasuring 83.00 Square Yards or equivalent to 69.39 Sq. meters situated at Murad Mahal Gowlipura, Hyderabad, From **Renuka Ralegoankar.,** who are the original absolute owner of the above said property. If anyone having objections regarding the said transaction please contact to the below addresses and Reply within the Period of 15 days.

**Sd/-M/s.SIDDHANT SHIV SAGAR,**
Advocate,
Off; Flat No. G3, Lotus Plaza Apts, Street No. 12, Himayath Nagar, Hyderabad, T.S.
Mobile: 8639460607, 9030893249

**LOSS OF DOCUMENT**

The General Public are hereby informed that my client Sri. Susarla Venkata Surya Sambhu Prasad, S/o. Late S.Ramachandra Rao, Age: 55 Years, Occ: Pvt Job, R/o.4-192/sbt/306, Siri Balaji Towers, Nizampet, Hyderabad - 500090, lost his original sale deed documents bearing. No. 952/1968 dated 17.06.1968 along with all the link documents pertaining to the above-mentioned property was lost in ISCKON temple, Abids, Hyderabad 0n 20.02.2023, if any body found that documents may misuse it therefore the public are hereby informed not to deal with the said property, in spite of this notice if any body enter in to any transaction my client is not responsible for the same, and the above said documents may kindly be handed over to the undersigned if found. The finder may be suitably rewarded.

**S.SRIDHAR**
**Advocate**
Flat No.301, Arunkiran Residency Ganga Vihar Colony, Begumpet, Secunderabad.
**7569368416, and Susarla Venkata Surya Sambhu Prasad 8008924201.**

## డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని సిఎంకు వినతి : కార్పొరేటర్ రజితరెడ్డి



సిఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 31 ప్రభాత వార్త :** ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ మందముల రజితరెడ్డి బుధవారం సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలకు పక్కాభవనం నిర్మించేందుకు ఉప్పల్ భగాయత్‌లో ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని సూచించారు. డిగ్రీ కళాశాలకు స్వంత భవనం లేకపోవడవం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలో అరకొర సౌకర్యాలతో తరగతులు నిర్వహిస్తున్నారని దీనిపై తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు అంశాలను ఆమె సిఎం దృష్టికి తీసుకుని వచ్చారు. అదే విధంగా డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు, కంప్యూటర్ ల్యాబ్, కెమిస్ట్, సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## షబ్బీర్‌అలీతో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి



షబ్బీర్‌అలీతో బేటి అయిన లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జనవరి 31 ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వసలహాదారుడు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో షబ్బీర్‌అలీని కలిసి పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎస్సీఎస్టీ మైనార్టీ ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్‌అలీ తనకు ఎంతో సుపరిచితుడని తెలిపారు. ఎస్టీఎస్టీ మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఎస్సీఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు భృతి ఇవ్వాలి : సిఐటియు

**సరూర్‌నగర్, జనవరి 31 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమలు చేయడంతో ఆటోడ్రైవర్లకు ఆర్థిక ఇబ్బందులు కలుగుతున్నాయనీ ఈ నేపథ్యంలో కల్లు గీత కార్మికులకు ఇస్తున్న విధంగానే ఆటో డ్రైవర్లకు ప్రతి నెలా రూ.4500 భృతి ఇవ్వాలని సిఐటియు నాయకులు కోరారు. బాలాపూర్‌చౌరస్తా సమీపంలోని ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్‌వద్ద జరిగిన సమావేశానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ ఆటో, ట్రాలీ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫిబ్రవరి 16వతేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, రుద్ర కుమార్, నర్సి రెడ్డి, ఎల్లయ్య, వీరయ్య, సత్యనారాయణ, రమేష్, కరుణాకర్ రెడ్డి, ఆంజనేయులు, రాము, సురేష్, రాజేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## వనస్థలిపురం సిఐగా రవికుమార్ బాధ్యతలు

**వనస్థలిపురం, జనవరి 31 ప్రభాతవార్త :** వనస్థలిపురం సిఐగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన బోరోజు రవికుమార్‌ను తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ వింజమూరు రాఘవాచారి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాగిఫణి సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి పోతకమూరి రమేష్‌చారి, సభ్యులు ముత్తోజు బ్రహ్మచారి, లక్ష్మణ్‌చారి, వన్నోజు సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనదారులు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలి : కమిషనర్ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** రోడ్డుభద్రతకు సంబంధించి అవగాహన పెంపొందించుకోవాలని జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సి. రమేష్ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా బుధవారం నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ కార్యాలయంలో భారీ వాహనాలు పాఠశాల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు ముఖ్యంగా పాఠశాల బస్సు డ్రైవర్లు విద్యార్థులు బస్సు ఎక్కే ముందు దిగే ముందు జాగ్రత్తలు వహించాలని సూచించారు. నాగోల్ ఆర్టీఏ జి.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ అధికవేగంతో వాహనాలు నడపవద్దని సూచించారు. గమ్యానికి చేరుకోవడానికి ముందుగానే బయలుదేరి సమయానికి సురక్షితంగా చేరుకోవాలన్నారు. డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకుని వాహనాన్ని నడపాలని అలసట వచ్చినప్పుడు వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకున్న అనంతరం సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి రిటైర్డ్ ఆర్టీవో విజయపాల్‌రెడ్డి పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సదస్సులో డాక్టర్ స్టాన్లీజోన్స్ బృందం డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సదస్సు లో ఎంవిఐలు ఎస్.శ్రీనివాస్, జిఆర్ రాజు. కే.రవీందర్‌రెడ్డి. శీతల్‌చౌహాన్, సి.స్వప్న, పి.రఘుకుమార్, బి.మానస, ఎం.అనిత, ఎన్.సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

## పెన్షనర్ల సంక్షేమానికి కృషి : కోదండరాం



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

**మలక్‌పేట, జనవరి 31 ప్రభాతవార్త :** పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మలక్‌పేట సలీంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మారం భరత్‌రెడ్డి, వినయ్‌కుమార్, సభ్యులతో కలిసి డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత ఉద్యమంతో ప్రత్యేకరాష్ట్రాన్ని సాధించడం జరిగిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చేసిన సేవలకు ఎమ్మెల్సీ పదవి లభించినట్లు భావిస్తున్నామని తెలిపారు. అనంతరం భరత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెన్షనర్లకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి సుధాకర్, కోశాధికారి ప్రసాద్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

## చెరువులో చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి: కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ చెరువులో గుర్రపు డెక్క, చెత్తా చెదారం చేరకుండా ఎప్పటికప్పుడు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శానిటేషన్, ఎంటమాలజి సిబ్బందితో బుధవారం తపోవన్ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీవైపు చెరువులోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించే పనులను పర్యవేక్షించిన అనంతరంనకార్పొరేటర్ మాట్లాడుతూ చెరువులో చెత్తా చెదారం పేరుకు పోవడం వల్ల పరిసర కాలనీల ప్రజలు దోమలు, దుర్వాసన వంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. చెరువును ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా అధికారులు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసి దశరథ్, డిఇ వెంకటేషం, గ్రీన్‌పార్క్ కాలనీ, తపోవన్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



గాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లెలగూడ చందన చెరువు కట్టపై మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులతో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## చైతన్యపురి ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లుకు సత్కారం

**ఎల్.బి.నగర్, జనవరి 31 ప్రభాతవార్త :** చైతన్యపురి నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సురేష్, శ్రీనివాస్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, ఇస్మాయిల్, మాచర్ల వరుణ్, కాళిదాసు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ బ్రిడ్జి అలైన్‌మెంట్‌ను మార్చాలని వినతి



డిసిపికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** సైదాబాద్ మెయిన్ రోడ్డుపై చేపడుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణాన్ని హనుమాన్ దేవాలయంపై నుంచి వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బిజెపి నాయకులు బుధవారం సౌత్‌ఈస్ట్ జోన్ డిసిపి ధరావత్ జానకికి వినతిపత్రం అందజేశారు. ఆలయంపైనుంచి బ్రిడ్జి వెళ్లకుండా అలైన్‌మెంట్‌ను మార్చాలని వారు డిసిపిని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్, చవ్వా సతీష్ కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, వినయ్ కిషోర్ యాదవ్, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌కు సత్కారం



పద్మశ్రీ సోమ్‌లాల్ నాయక్‌ను సత్కరిస్తున్న తూళ్ల వీరేందర్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, జనవరి 30 ప్రభాతవార్త :** హబ్సిగూడలో నివాసం ఉంటున్న పద్మశ్రీ సోమ్‌లాల్‌నాయక్‌ను బుధవారం మల్కాజిగిరి పార్లమెంట్ బిజెపి సీనియర్ నేత తూళ్ల వీరేందర్‌గౌడ్ పలువురు పార్టీ నేతలతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు బుధవారం ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో తూళ్ల వీరేందర్‌గౌడ్‌తోపాటు, నేతలు దేవసాని బాలచందర్, రఘుపతిగౌడ్, సంజయ్‌పటేల్, ఎల్లాచారి, రాగి లత వెంకట్‌రెడ్డి, నిరంజన్, వెంకన్నగౌడ్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడండి : కమిషనర్

**తుర్కయంజాల్, జనవరి 31 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ పురపాలక సంఘ పరిధిలోని ప్రజలు, సకాలంలో ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు (ట్రేడ్ లైసెన్సులు) చెల్లించి తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడాలని కమీషనర్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో కమీషనర్ క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళి పన్ను వసూళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించుట ద్వారా మున్సిపాలిటీ అభివృద్ధి అవుతుందన్నారు. స్వచ్ఛందంగా వచ్చి ఇంటి పన్నులు, వ్యాపార లైసెన్సులు చెల్లించిన వారిని కమీషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పిఈసి) సమావేశం సందర్భంగా సిఎం, టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి (సరూర్‌నగర్, ప్రభాతవార్త)

## వారం రోజులుగా మూగనోము పట్టిన లిఫ్ట్



నిరుపయోగంగా మారిన లిఫ్ట్

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో గత వారం రోజులుగా లిఫ్ట్ పనిచేయక దిష్టి బొమ్మగా మారింది. వారం రోజులుగా లిఫ్ట్ మూగనోము పట్టినప్పటికీ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ఎల్బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ 3 సర్కిల్లో ఉన్న ఈ కార్యాలయంలోని లిఫ్ట్ బాగు చేసేందుకు ఒక్క అధికారికి కూడా తీరిక దొరకడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. లిఫ్ట్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఎప్పుడు ఏదో ఒక సమస్యతో లిఫ్ట మూగనోము పడుతుంది. వివిధ పనుల కోసం సర్కిల్ కార్యాలయానికి వచ్చే మహిళలు, వృద్ధులు, వికలాంగులు లిఫ్ట పనిచేయక పోవడంతో నానా తిప్పలు పడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బాగు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రౌడీషీటర్లకు మహేశ్వరం డిసిపి కౌన్సిలింగ్

**సరూర్‌నగర్, జనవరి 31 ప్రభాతవార్త:** బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లుగా నమోదైన వారికి మహేశ్వరం డిసిపి సునీతరెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల కాలంగా బాలాపూర్ పిఎస్ పరిధిలో వరుస హత్యలు జరుగుతుండడం అందులో రౌడీషీటర్లు నిందితులుగా ఉండడంతో డిసిపి వారిపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో పిఎస్ పరిధిలోని మంగళవారం హత్యలు జరిగిన ప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఆమె స్టేషన్‌కు వచ్చారు. అక్కడ అప్పటికే రప్పించిన పలువురు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి నేరాల విషయంలో హెచ్చరికలు చేశారు. నేరాలకు పాల్పడకుండా బుద్ధిగా మసులుకోవాలనీ ఏ కేసులోనైనా ఇన్వాల్వ్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు ఉన్నారు.

## మార్చి 25 నుంచి సనాతన వేదాంత జ్ఞాన సభలు

**హైదరాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** మార్చి 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు బాలాపూర్ ఎస్.పి.ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు గడ్డిఅన్నవరం సత్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ ఊర నర్సింహాగుప్త పేర్కొన్నారు. జ్ఞాన సభలు నిర్వహిస్తున్న సందర్భంగా శ్రీవ్యాసాశ్రమ గురుపరంపర స్వాములకు బుధవారం వారి నివాసంలో పూల మాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఊర శ్రీనివాస్ గుప్త, పాల్తీ శ్రీనివాస్‌గుప్త, అశోక్‌గుప్త, సూరిశెట్టి శ్రీనివాస్, పాండుగుప్త, దయాకర్‌గుప్త, బిళ్ళ కంటి రాజు, కాసినాథ్, దుశ్శా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## లీగల్ సెల్ కన్సల్టెన్సీ ఏర్పాటు : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న లాయర్లు

**మల్కాజిగిరి, జనవరి 31 ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి లీగల్ సెల్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లి పార్టీ క్యాంప్ ఆఫీస్‌లో దినేష్ ఆధ్వర్యంలో పలువురు లాయర్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు శ్రీధర్, శ్రీనాథ్‌రెడ్డి, దినేష్, సుముఖ, మాధవి, రాధ ప్రసన్న, డైస్సి, లక్ష్మిమాధవి పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య లేకుండా తగిన చర్యలు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, శాంతి శేఖర్

**నాచారం, జనవరి 31 ప్రభాతవార్త:** నాచారం డివిజన్‌లో డ్రైనేజీ సమస్య లేకుండా తగిన చర్యలు తీసుంటామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం విఎస్‌టీ కాలనీ సత్యమెస్ వీధిలో బుధవారం రూ. 10లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళికా బద్దంగా నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం కార్పోరేటర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పురాతన పైపులైన్ కారణంగా తరుచు డ్రైనేజీ సమస్య తలెత్తుతుందని దానిని అదిగమించడానికి పైపులైన్ పనులను ఏర్పాటు చేయిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం మేనేజర్ సందీప్, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, జీఎస్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తధితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ

**కుషాయిగూడ, జనవరి 31 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ ఏఈ రామ కృష్ణ తెలిపారు. జమ్మిగడ్డ 11 కెవి నాగార్జుననగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జై కిసాన్ కాలనీ, స్థాయిలోక్ కాలనీ, భగత్ నగర్ ,నెహ్రూ నగర్, విరాట్ నగర్, శివసాయినగర్, సింగిరెడ్డిస్వామినగర్‌కాలనీలో ఫిబ్రవరి 1గురువారం 10.30 నుండి2:30వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కుషాయిగూడ తెలిపారు. అదేవిధంగా 11 కెవి జై జవాన్ కాలనీ ఫీడర్ పరిధిలోని జై జవాన్ కాలనీ ఆదర్శనగర్, జిఆర్‌రెడ్డినగర్, దేవీనగర్, బిజేఆర్‌కాలనీ, మారుతినగర్, న్యూ శ్రీనివాస నగర్, సాకేత్ టవర్స్, తిరుమల హార్మోని, మా హోమ్స్, అశోక్ మనోజ్ ఎంక్లేవ్, రాజరాజేశ్వరి ఎంక్లేవ్, ల్యాండ్ మార్క్ జ్యోతి బిల్డర్స్ ప్రాంతాలలో ఉదయం 10 గంటలకు అదే క్రమంలో సాకేత్ ప్రణామ్ 11 కెవి ఫీడర్ పరిధిలోని సాకేత్ ఫేస్ 1, ఫేస్ 2, ఫేస్ 3, ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 గంటలనుండి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

## టీ..20 టోర్నీ విజేత.... సగ స్పోర్ట్స్ క్లబ్



విజేతలతో క్లబ్ సభ్యులు

**నేరేడ్‌మెట్, జనవరి 31 ప్రభాతవార్త :** నగరంలో నిర్వహించిన సన్ ప్రీమియర్ టి...20 లీగ్ టోర్నమెంట్‌లో సగా స్పోర్ట్స్ క్లబ్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకుందని నిర్వాహకులు వినోద్ తెలిపారు. జనవరి 25 నుంచి 30వ తేదివరకు జరిగిన ఈ టోర్నమెంట్‌లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయని ఇందులో స్పోర్ట్స్ క్లబ్, గ్రీన్ స్పేస్ క్రికెట్ క్లబ్ ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో స్పోర్ట్స్ క్లబ్ విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. బెస్ట్ బ్యాట్స్ మెన్ గా దామోదర్‌రెడ్డి, బెస్ట్ బౌలర్‌గా తిలక్‌సాయి, బెస్ట్ ఫీల్డర్‌గా జగదీశ్‌రెడ్డి, బెస్ట్ వాలీబాల్ ప్లేయర్‌గా భరత్‌లు అవార్డులు గెలుచుకున్నారని విజేత జట్టుకు ట్రోఫిని ప్రానం చేసినట్లు వినోద్ తెలిపారు.

## బైరామల్‌గూడ చెరువులోని మురుగునీటిని మోటార్లతో బయటకు తీస్తాం: సుధీర్‌రెడ్డి



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 31 ప్రభాతవార్త:** బైరామల్‌గూడ చెరువును ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. మురుగునీరు వెళ్లడంకోసం ఏర్పాటు చేసిన జంక్షన్‌ను ఎమ్మెల్యే పరిశీలించి నీరు సాఫీగా వెళ్తుండడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం చెరువును ఎమ్మెల్యే సందర్శించిన సమయంలో జంక్షన్‌వద్ద చెత్తాచెదారాన్ని నిత్యం తొలగించేలా ప్రత్యేకంగా వ్యక్తిని నియమించాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనలమేరకు ఇద్దరువ్యక్తులను నియమించి జంక్షన్‌వద్ద రోజు శుభ్రం చేయిస్తున్నారు. దీంతో అధికారుల పని తీరుపట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులోని మురుగునీటిని తొలగించడానికి రెండు మోటార్లను ఏర్పాటుచేయిస్తానని, జెసిబితో చెరువులోని వ్యర్థాలను బయటకు తీసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, డిసి దశరథ్, డిఇ పవన్, ఇఇ కోటేశ్వరరావు, అధికారులు సరిత, రమ్యభారతి, నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ముడుపు రాజిరెడ్డి, బొంబాయి, సురేష్‌గౌడ్, మల్లేష్‌గౌడ్, ఉమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన డాటా ఎంట్రీ బిల్లులు చెల్లించాలని విద్యార్థుల ధర్నా



సర్కిల్ కార్యాలయంవద్ద ధర్నా చేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్లు, విద్యార్థులు

**ఉప్పల్, జనవరి 31 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన ఆరు గ్యారంటీల డాటా ఎంట్రీ చేసిన కంప్యూటర్ ఆపరేటర్ల బిల్లులు చెల్లించాలని కోరుతూ పలువురుఆపరేటర్లు, విద్యార్థులు బుధవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలువురు ఆపరేటర్లు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల డాటాను ప్రైవేటు విద్యార్థులు, కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో ఎంట్రీ చేశారు. ఉప్పల్ సర్కిల్‌లో సుమారు 130 మంది విద్యార్థులు పది రోజుల పాటు పనిచేసి డాటా కంప్యూటరీకరణ చేశారు. అయితే వీరికి ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.12 చెల్లించేందుకు నిర్ణయించింది. ప్రతిరోజు వందచొప్పున విద్యార్థులు కంప్యూటరీకరణ చేశారు. కాగా డాటా ఎంట్రీ పూర్తి అయి పక్షం రోజులు గడిచినా తమ బిల్లులు చెల్లించకపోవడంతో బుధవారం డిసి శ్రీనివాస్‌ను కలిసేందుకు పలువురు ఆపరేటర్లు వచ్చారు. ఇదే క్రమంలో కమిషనర్‌తో వారు బిల్లులు చెల్లించాలని గొడవ పడ్డారు. దీంతో ఆయన బయటకు వెళ్లండి, ధర్నా చేసుకోండి అంటూ నిర్లక్ష్యంగా సమాదానం ఇచ్చారని విద్యార్థులు ఆరోపించారు. కమిషనర్ వైఖరికి నిరసనగా సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. దీనిపై ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

**కమిషనర్ శ్రీనివాస్ వివరణ :** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆరు గ్యారంటీల అభయ హస్తం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసేందుకు కళాశాల విద్యార్థులు నియమించినట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. అందుకు వారికి ఇవ్వాల్సిన డబ్బులు గురించి ఉన్నతాధికారులకు ఫైల్ పంపించినట్లు తెలిపారు. కొంత మంది విద్యార్థులు ఆందోళనగా వచ్చి డబ్బుల గురించి అడిగారని, ప్రత్యేక శ్రద్ధతో వారికి రావాల్సిన డబ్బులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. తాను ఎవరితో దురుసుగా ప్రవర్తించలేదని ఆయన వివరణ ఇచ్చారు.

## శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు : కార్పొరేటర్ లచ్చిరెడ్డి



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న శ్రీపురం కాలనీ సంఘం నూతన కమిటీ సభ్యులు

**వనస్థలిపురం, జనవరి 31 ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డినగర్ డివిజన్ శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం కాలనీ అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయనను కోరారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ముత్యంరావు, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, దామోదర్‌రావు, కోశాధికారి పాండురంగం, సంయుక్త కార్యదర్శి అరవింద్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు సూర్యవర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ, సభ్యులు యాదయ్యయాదవ్, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి : శ్రీలత అనిల్‌కుమార్



ఎఇకి వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీలత అనిల్‌కుమార్

**తుర్కయంజాల్, జనవరి 31 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు సూచికలుఏర్పాటు చేయాలని కౌన్సిలర్, బిజెపి ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలోరంగారెడ్డిజిల్లా రోడ్లు, భవన నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ కోహెడనుంచి ఉమర్‌ఖాన్‌గూడా వెళ్లే మార్గంలో మూలమలుపులు ఎక్కువగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాదాల నివారణకు సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ లైన్లు, లైట్లను ఏర్పాటుచేసి ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించామని అధికారులు సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారంకోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి, బండారు దానయ్య, గొట్టె యోజిత్, యువాచ్ తదితరులు పాల్గొన్నారు.